సాక్షి సంగారెడ్డి

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



కల్తీ సవాల్..!

పాలు, నెయ్యి కల్తీ చేస్తున్న వారిపై పోలీసులు కేసులు పెడుతున్నా తీరు మారడం లేదు.

వివరాలు 8లో ▸



మౌలిక వసతులేవీ?

తూప్రాన్ మేజర్ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారినా సౌకర్యాలు మాత్రం మెరుగుపడలేదు.

వివరాలు 8లో ▸



‘రక్షణ’ లేని ప్రయాణం

మండలంలోని పలుచోట్ల ఉన్న రోడ్లపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

సింగూరుకు వరద ఉధృతి



పుల్‌కల్(అందోల్): భారీ వర్షాలు కురుస్తుండడంతో సింగూరు ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. దీంతో రెండు రోజుల నుంచి ఏడు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతున్నారు. ఎగువ నుంచి 76,736 క్యూసెక్కులు ఉండగా.. ఏడు గేట్ల ద్వారా 74,049 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, కర్నాటకలోని కరింజా డ్యాం నుండచి వరదలు వస్తుండగా.. ఎగువను ఉన్న మునిపల్లి దుబ్బ వాగు రాయికోడ్, వట్‌పల్లి, రేగోడ్ మండలాల్లోని వాగుల నుంచి నీరు డ్యాంలోకి చేరుకుంటుంది. జలవిద్యుత్ కేంద్రానికి 1,499 క్యూసెక్కులు వదులుతుండటంతో ఒక టర్బయిన్‌తో విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టుకు వరద నీరు ఉధృతి ఉండడంతో పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో జంట నగరాల నుంచి పర్యాటకులు రాగా, డ్యాం వద్ద సందడి నెలకొంది.

తగ్గని బారులు.. తీరని వెతలు



యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

హత్నూర(సంగారెడ్డి): యూరియా కోసం రైతులు నిత్యం ఎరువుల దుకాణాల ఎదుట బారులు తీరుతున్నారు. ఆదివారం మండలంలోని దౌల్తాబాద్‌లో రెండు ఎరువుల దుకాణాలకు యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా తరలివచ్చారు. ఈ మేరకు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో నిల్చున్నారు. ఒక రైతుకు రెండు యూరియా బస్తాలు ఇవ్వడంతో నిత్యం యూరియా కోసం పని మానుకొని రావాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 15 రోజులుగా యూరియా కోసమే తిండి తిప్పలు మాని తిరుగుతున్నామని, కానీ యూరియా మాత్రం సరిపడా దొరకడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు సరిపడా యూరియా అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సంగారెడ్డిలో ‘బ్రహ్మాండ’ చిత్ర యూనిట్ సందడి



రుక్మిణి థియేటర్‌లో బ్రహ్మాండ సినిమా హీరో బన్నీ రాజుతో చిత్ర యూనిట్

సంగారెడ్డి: జిల్లా కేంద్రంలోని రుక్మిణి థియేటర్‌లో బ్రహ్మాండ చిత్ర యూనిట్ సందడి చేసింది. ఆదివారం సినిమా రిలీజ్ సందర్భంగా పట్టణంలోని రుక్మిణి థియేటర్‌లో చిత్ర యూనిట్ మొదటి షోను ప్రారంభించింది. ఈ సందర్భంగా సినిమా హీరో బన్నీ రాజు మార్నింగ్ షోను ప్రారంభించి ప్రేక్షకులతో కలిసి తిలకించారు. థియేటర్‌కు హీరో వస్తున్న విషయం తెలుసుకున్న అభిమానులు విజిల్స్, కేరింతలతో స్వాగతం పలికారు. దీంతో ప్రేక్షకుల అరుపులతో థియేటర్ మార్మోగింది. ఈ సినిమాలో చిన్న చిన్న పాత్రలను పెద్ద ఆర్టిస్టులు సైతం చేశారని చిత్ర యూనిట్ ప్రొడ్యూసర్ ఎడ్ల మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుక్మిణి థియేటర్ మేనేజర్ వెంకటేశం, విలన్ విష్ణు, సురేష్, కాసుల కార్తీక్, ఆపరేటర్ రవి, సిబ్బంది సుధాకర్, సిద్దులు పాల్గొన్నారు.

సత్తా చాటిన ‘ప్రభుత్వ’ విద్యార్థులు

- నిజాంపూర్ కాలనీ పాఠశాలకు 49 సర్టిఫికెట్లు
- పర్యావరణ కాంపిటేషన్‌లో జిల్లాలో మొదటి స్థానం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పర్యావరణ కాంపిటేషన్‌లో మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సత్తా చాటింది. నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటేషన్-2025 ఫలితాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విభాగంలో నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల 49 సర్టిఫికెట్లు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల విభాగంలో 3వ స్థానం, మొత్తం మీద 33వ స్థానం సాధించిందని ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులను ఎంఈఓ శంకర్, నోడల్ అధికారి సుధాకర్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు రాజశ్రీ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రభుత్వ బడుల్లో రాగిజావ

విద్యార్థులకు పౌష్టికాహారం దిశగా అడుగులు



- నేటి నుంచి పంపిణీకి శ్రీకారం
- రెండున్నర నెలల తర్వాత పథకం పునఃప్రారంభం
- ఉమ్మడి జిల్లాలో 2.70లక్షల మంది విద్యార్థులకు మేలు
- నేడు సంగారెడ్డి జిల్లాలోని పోతిరెడ్డిపల్లిలో ప్రారంభం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేస్తున్న ప్రభుత్వం.. మరింత పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశ్యంతో రాగిజావను అందజేయాలని నిర్ణయించింది. అయితే రెండేళ్లుగా రాగిజావను అందజేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది ప్రారంభం నుంచి నిలిపివేయగా.. దాదాపు రెండున్నర నెలల తర్వాత ఈ పథకాన్ని తిరిగి పునః ప్రారంభించనుంది. ఇందులో భాగంగా నేటి నుంచి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ బెల్లంతో కూడుకున్న రాగిజావ అందించనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాఠశాలల విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేసింది. పీఎం పోషన్ (మిడ్‌డే మిల్) పథకం కింద 2025-26 విద్యా సంవత్సరానికి రాగిజావ సరఫరాకు అనుమతి మంజూరైంది.

– నారాయణఖేడ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,186 పాఠశాలల్లో చదువుతున్న 2.70లక్షల మంది విద్యార్థులకు రాగిజావ పంపిణీ ద్వారా ప్రయోజనం చేకూరనుంది. అయితే ఇంటి నుంచి ఉదయం ఖాళీ కడుపుతో పాఠశాలలకు బయలుదేరే చిన్నారులు తరగతి గదుల్లో అలసి పోతున్నారు. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం ఉదయం అల్పాహారంగా బెల్లంతో కూడిన రాగిజావ అందజేస్తే ప్రయోజనకరంగా ఉండడంతోపాటు విద్యార్థులు పౌష్టికాహారం అందుతుందని భావించింది. ఈ మేరకు ఈ పథకాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగానే సంగారెడ్డి జిల్లాలోని జెడ్పీహెచ్ఎస్ పోతిరెడ్డిపల్లి పాఠశాలలో సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

ఉమ్మడి జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
సంగారెడ్డి	1,265	1,02,000
మెదక్	980	98,000
సిద్దిపేట	941	72,000

పకడ్బందీగా అమలు చేస్తాం



పాఠశాలల్లో రాగిజావ పంపిణీ పథకాన్ని తిరిగి ప్రభుత్వం కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు జెడ్పీహెచ్ఎస్ పోతిరెడ్డిపల్లి పాఠశాలలో సోమవారం ప్రారంభిస్తాం. రాగిజావ, బెల్లం ప్యాకెట్లు సత్యసాయి ట్రస్టు నుంచి రావాల్సి ఉంది. రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి, సంగారెడ్డి

రెండున్నర నెలల తర్వాత..

ఈ ఏడాది జూన్ 12న కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవ్వగా.. దాదాపు రెండున్నర నెలల తర్వాత ఈ పథకం అమలు కానుంది. గతంలో మాదిరిగా సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు సహకారంతో పథకాన్ని అమలు చేయనుంది. ట్రస్టు 60శాతం వ్యయం భరిస్తుండగా.. 40శాతం ప్రభుత్వం భరించి ఈ పథకాన్ని అమలు చేయనుంది. సత్యసాయి ట్రస్ట్ విద్యార్థులకు అవసరమైన ఫోర్టిఫైడ్ రాగి పొడి, బెల్లం పొడి పాకెట్లను పాఠశాలలకు సరఫరా చేస్తుంది. అనంతరం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం కొనసాగిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు రాగిజావను తయారు చేసి విద్యార్థులకు అందించనున్నారు. ప్రతీ గ్లాసుకు ప్రభుత్వం రూ.25 పైసల చొప్పున చెల్లించనుండగా.. వారంలో మూడు రోజుల పాటు ప్రతీ విద్యార్థికి రోజుకు 10 గ్రాముల రాగి పొడి, 10 గ్రాముల బెల్లం పొడి ఇవ్వాలని ఆదేశింశించారు. ఇందులో భాగంగానే వారంలో మూడు రోజులు గుడ్లు ఇవ్వని రోజుల్లో రాగిజావ, మిగతా మూడు రోజులు గుడ్లు అందించనున్నారు. అయితే ప్రారంభం నుంచి రావిజావ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆతర్వాత విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. కాగా, జిల్లాలోని అన్ని మండలాలకు ఇప్పటికీ రాగిజావ, బెల్లం పాకెట్లు చేరుకోలేదు. రెండు రోజుల్లో ఎమ్మార్సీలు, అక్కడి నుంచి పాఠశాలలకు వీటిని చేరవేయనున్నారు.

చెరకు సాగు విస్తరణకు సహకారం

- గోదావరి-గంగా ఆగ్రో చెక్కర కర్మాగారం ఎండీ సచిన్ గోయాల్
- ముంగి, హద్నూర్, రుక్మాపూర్‌లలో చెరకు పంటల పరిశీలన



ముంగిలో రైతులతో సమావేశమైన గోయాల్

న్యాల్‌కల్(జహీరాబాద్): చెరకు పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని గోదావరి-గంగా ఆగ్రో చెక్కర కర్మాగారం ఎండీ సచిన్ గోయాల్ అన్నారు. న్యాల్‌కల్ మండల పరిధిలోని ముంగి, హద్నూర్, రుక్మాపూర్‌లలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ మేరకు క్షేత్ర స్థాయిలో చెరకు పంటను పరిశీలించి అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నామన్నారు. అక్టోబర్‌లో ఫ్యాక్టరీలో చెరకు క్రస్సింగ్ ప్రారంభమవుతుందని, ఈ ఏడాది 3లక్షల టన్నుల క్రస్సింగ్ చేసేందుకు నిర్ణయించామన్నారు. రోజుకు దాదాపు 2,700 టన్నుల చెరకు క్రస్సింగ్ చేయనున్నామని తెలిపారు. గతేడాది టన్నుకు రూ.3,700 చెల్లించగా.. కోత, రవాణా ఖర్చులు పోను రైతుకు రూ.2,800 మిగిలిందన్నారు. రైతులను ప్రోత్సాహం అందించి పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు సుమారు 85లక్షల చెరకు మొక్కలు అందజేసినట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది 15లక్షల మొక్కలను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేన్ డెవలప్‌మెంట్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ సురేందర్ పాటిల్, రైతులు నర్సింహారెడ్డి, విఠల్ రెడ్డి, అశోక్, తుల్జారాం తదితరులు పాల్గొన్నారు.

‘ఆకుకూరల’ పండుగ

- 30 రకాల సహజ ఆకుకూరలతో వంటకాలు
- ఆరోగ్యాన్ని అందించే పోషకాలపై అవగాహన



సహజ ఆకుకూరలతో తయారు చేసిన వంటకాలను వడ్డిస్తున్న మహిళా రైతులు

జహీరాబాద్: వర్షాకాలంలో సహజంగా వచ్చే మొక్కల్లో ఆరోగ్యాన్ని అందించే పోషకాలు ఉంటాయని సందర్శకులకు పోషకాహార నిపుణులు అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని దిడిగిలో గల కేవీకేలో డీడీఎస్ ఆధ్వర్యంలో సహజ ఆకుకూరల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాల నుంచి వందకు పైగా సందర్శకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 40 రకాల సహజ ఆకుకూరలను ప్రదర్శనలో ఉంచారు. అనంతరం 30 రకాల ఆకుకూరలతో వండిన వంటకాలతో భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా పోషకాహార నిపుణులు సలోమి మాట్లాడుతూ.. పంట పొలాల్లో సహజంగా వచ్చే మొక్కల్లో అనేక పోషకాలు ఉంటాయన్నారు. అయితే వీటిని కలుపు మొక్కలుగా భావించి తొలగిస్తుంటారన్నారు. కానీ ఇవి కలుపు మొక్కలు కాదని, ఆకు కూరలుగా ఉపయోగించుకోవచ్చని అవగాహన కల్పించారు. ఇందులో భాగంగానే జహీరాబాద్‌లోని పస్తాపూర్, న్యాల్‌కల్‌లోని గుంజోటిలలోని జీవవైవిధ్య పొలాలను సందర్శించారు. అనంతరం జహీరాబాద్‌లోని దిడిగిలో ఉన్న కేవీకేలో అనుభవ రైతులు చంద్రమ్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ మీలా అవగాహన కల్పించారు. అనంతరం ఆకు కూరల గొప్పతనాన్ని పాటల రూపంలో మహిళలు పాడి ఆకట్టుకున్నారు.

కలుపు మొక్కలు కాదు.. పోషకాలు



పంట చేలో సహజంగా వచ్చే ఆకు కూరలపై సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న రైతులు

తుమ్మికూర, తలైలి, అడవిమెంతి, జొన్న చెంచేలి, అడవి సోయ, దొగ్గలి, బంకటి, ముల్లు దొగ్గలి, పెద్ద కాశ, ఎర్రకాశ, తెల్ల బచ్చలి, ఎర్ర పుండి, తెల్లపుండి, దుసరి, ఉత్తరేణి, చెన్నంగి, వామకూర, తగిరెంచ, తెల్లగర్జ, ఎర్రగర్జ, పాల పత్రం, చామగడ్డ, నాగ చెవిలి, సన్న వాయిలి, మునగకూర, గునుగు, ఎర్ర గునుగు, చిత్రమలం, నాగలిచెవి, తడక దొగ్గలి, గంగ వాయిలి, చిన్న కాశ, గుర్మశి, పప్పుకూర, పిట్టకూర, చెన్నంగి, ఎన్నాద్రి, పుల్లకూర, ఎలుకచెవి అలం, అంగిబింగి, తెల్లవార్జం పువ్వు వంటి ఆకు కూరలు వర్షాకాలంలో సహజంగా లభిస్తాయని పోషకాహార నిపుణులు తెలిపారు. ఇవి కలుపు మొక్కలు కాదని.. పోషకాలు అందించే ఆకు కూరలు అని వెల్లడించారు.

‘భావ తరంగాలు’తో ప్రేరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ రఘునందన్ రావు

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రజ్ఞా భారతి ఆధ్వర్యంలో పాకా రాజమౌళి రచించిన ‘భావతరంగాలు భారతి’ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ రఘునందన్ రావు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజమౌళి రచించిన భావ తరంగాలు ఎంతో మందికి ప్రేరణాదాయకంగా ఉందన్నారు. అనంతరం ఆయన రచనా స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజ్ఞా భారతి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి, వడ్డీ విజయ సారథి, పూర్ణ కృష్ణ, చంద్రశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొడదాం

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్

సదాశివపేట(సంగారెడ్డి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొడదామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రహమాన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాలులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మిలిటెంట్ తరహాలో ఉద్యమాలు చేపడతామన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి వెంకటరాజ్యం, ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఆంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షుడు ఆనంద్, సలీం, లక్ష్మి, నాయకులు ఖాజా, ప్రవీణ్, శివశంకర్, మల్లేశం, శంకరప్ప, మహబుబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ అదరహో



లడ్డూను కేవసం చేసుకున్న కాలనీవాసులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అంకురలో గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో ఆదివారం వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక లడ్డూను వేలం వేయగా.. కాలనీకు చెందిన అభిషేక్ రెడ్డి, మల్లేపల్లి రాజేందర్ రెడ్డిలు రూ.6,66,666లకు కై వసం చేసుకున్నారు. అనంతరం వారిని వినాయక కమిటీ సభ్యులు సన్మానించారు. అలాగే మై ఫెయిర్ విల్లాస్‌లో నాగేంద్ర కిషోర్ రూ.3.8లక్షలు, మేగ్నా మేడోస్ విల్లాస్‌లో వినోద్ రూ.2.7లక్షలు, బ్లూమ్ ఫీల్డ్ విల్లాస్‌లో దుర్గా ప్రసాద్ రూ.75వేలకు లడ్డూలను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంకుర సొసైటీ సభ్యులు రాధిక, నగేష్, కార్తీక్, శ్రీధర్, గణేష్, శ్రీశైలం, మల్లారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటేష్, ఉమా పాల్గొన్నారు.

మళ్లీ విధుల్లోకి ఉద్యాన విస్తరణ అధికారులు

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలో ఇటీవల పనిచేసిన ఉద్యాన విస్తరణ అధికారులను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. అయితే ఏప్రిల్ 31, 2020 సమయంలో అప్పటి ప్రభుత్వం బ్రేక్ ఇవ్వగా.. ఇటీవల ఆర్థిక శాఖ అనుమతితో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అనుమతితో మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని ఉద్యానశాఖకు తెలిపారు. దీంతో జిల్లాకు చెందిన ఏడుగురు ఉద్యాన విస్తరణ అధికారులను తిరిగి నియమించారు. ఈ అవకాశం ఇచ్చిన ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తిరిగి విధుల్లోకి వచ్చిన ఉద్యాన విస్తరణ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పండ్ల తోటలు, కూరగాయలపై రైతులకు తగిన సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. కాగా, కె.విఠల్, రవీందర్, సతీష్‌కుమార్, బి.విఠల్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్, సంగయ్యస్వామిలు విధుల్లో చేరారు.



రుద్రేశ్వరుడి అలంకరణలో..



సంగారెడ్డి బైపాస్ రోడ్డులో..




బాయ్స్ హైస్కూల్ ఎదురుగా గణేశ్

విభిన్న రూపాయా.. విఘ్న రాజాయా!

జిల్లా వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సంగారెడ్డిలోని వాడవాడల్లో విశేషాలంకరణలో కొలువుదీరిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగానే శ్రీ నగర్, మహాకాల్, పాత బస్టాండ్ చైతన్య యువజన సంఘం, గంజ్ మైదాన్ వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో, పరమశివుడు, అయోధ్య రాముడు, శ్రీకృష్ణుడు, బైపాస్ రోడ్డులోని లాల్ బాగ్ ఛా రాజా రూపంలో ఉన్న గణనాథులకు పూజలు చేశారు. కాగా రుద్రారం దేవస్థానంలో లంబోదరుడు రుద్రేశ్వరుడి వర్ణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



చంద్రహాస్ యూత్ మండపం



చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో

‘పరిషత్’ సందడి!

- పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్
- 6న ముసాయిదా జాబితా విడుదల
- వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష
- 10న తుది జాబితా విడుదల



సంగారెడ్డి జోన్: రానున్న పరిషత్ ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని షెడ్యూల్ విడుదల చేసింది. పోలింగ్ కేంద్రాలు, వాటి స్థితిగతులను పరిశీలించి జాబితా రూపకల్పన చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపించనున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ల ఆమోదంతో పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ఎంపీడీఓలు ప్రచురించనున్నారు.

జిల్లాలోని ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	మహిళలు	పురుషులు	ఇతరులు
అందోల్	84,948	82,015	6
నారాయణఖేడ్	95,075	95,964	6
నర్సాపూర్	21,919	20,797	2
పటాన్‌చెరు	29,261	20,797	2
సంగారెడ్డి	68,688	65,908	27
జహీరాబాద్	95,491	95,047	2

ఓటరు జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాల గుర్తింపు

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఈనెల 6న ముసాయిదా జాబితాను విడుదల చేయనున్నారు. జనవరి 1, 2025 ఓటరు జాబితా ప్రకారం.. జిల్లాలో ప్రాదేశిక ఎన్నికల నిర్వహణలో భాగంగా 1,547 పోలింగ్ కేంద్రాలను గుర్తించగా.. ప్రస్తుతం వచ్చిన ఓటరు జాబితా ఆధారంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించనున్నారు. ఆ తర్వాత ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాపై ఈనెల 8న జిల్లా, మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నారు. 6 తేదీ నుంచి 8వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అనంతరం వీటిని 9న పరిష్కరించి 10న తుది జాబితాను ప్రకటించనున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు తగిన మౌలిక వసతులు కల్పిస్తూ ఏర్పాటు చేయనున్నారు. ప్రధానగా తాగునీరు, విద్యుత్ సౌకర్యంతో పాటు దివ్యాంగులకు ర్యాంపు సౌకర్యం కల్పించనున్నారు.

రెండు విడతల్లో ఛాన్స్!

పరిషత్ ఎన్నికల నిర్వహణ రెండు విడతల్లో జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నెలలో మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదలై చివరి వారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

25 జెడ్పీటీసీ, ఎంపీపీలు.. 271 ఎంపీటీసీ స్థానాలు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మండలాలు వారీగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను అధికారికంగా ఖరారు చేసింది. ఈ మేరకు జిల్లాలో ఒక జిల్లా పరిషత్ చైర్మన్, 25 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలతో పాటు 271 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019 లో నిర్వహించిన పరిషత్ ఎన్నికల్లో 25 జెడ్పీటీసీ, 295 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. ఆ తర్వాత జిల్లాలో కొత్తగా ఏర్పడిన మండలాలతో పాటు పలు మండలాలు, గ్రామ పంచాయతీలతో కలిపి మున్సిపాలిటీలో విలీనంతో పాటు కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. దీంతో పరిషత్ స్థానాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్త పరిషత్ స్థానాల జాబితా ప్రకారం.. టాప్ 5 అత్యధిక స్థానాల్లో సంగారెడ్డి జిల్లా ఉండడం విశేషం.



పొంగిపొర్లుతున్న పోచారం అలుగు

'పోచారం' వద్ద తాత్కాలిక మరమ్మతులు

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్ జిల్లా సరిహద్దులో ఉన్న పోచారం డ్యామ్ వరద ఉధృతికి దిగువన ఉన్న బ్రిడ్జి కొట్టుకుపోయి మెదక్–బోధన్ రోడ్డు రవాణా సదుపాయం నిలిచిపోయింది. మూడు రోజులుగా వరద ఉధృతి ఎక్కువగా ఉండగా ఆదివారం తగ్గి అవతలి వైపు ఉన్న బ్రిడ్జిపై వరకు అధికారులు టిప్పర్లతో మట్టిని పోసి రాకపోకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్‌కు ఎల్లారెడ్డి, బోధన్, మెదక్ ప్రజలు ఈ రోడ్డు ద్వారానే వెళ్తారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసే దిశగా అధికారులు శ్రమిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో కురిసిన వర్షాలతో దిగువన ఉన్న పోచారం డ్యామ్, దూప్ సింగ్ తండాలకు రాకపోకలకు అంతరాయం కలుగడంతో పాటు నాలుగు రోజులుగా వరద ఉధృతి కొనసాగింది. ఆదివారం కొంత మేర తగ్గడంతో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయడంలో నిమగ్నమయ్యారు.



పోచారం డ్యామ్ దిగువన ఉన్న బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డు నిర్మిస్తున్న అధికారులు



వరదలతో కొట్టుకుపోయిన బ్రిడ్జి

క్లుప్తంగా

యోగా పోటీలకు 'మోడల్' విద్యార్థి



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మిరుదొడ్డి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని డి.స్వాతి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అర్చన ప్రియదర్శిని తెలిపారు. ఈ నెల 30న జిల్లా కేంద్రంలో యోగాసన భారత్ టోర్నమెంట్‌లో నిర్వహించిన యోగా ఫార్వర్డ్ బిల్డింగ్ విభాగంలో విద్యార్థి అద్భుతమైన ప్రతిభ కనబర్చింది. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిందని, అలాగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి స్వాతిని కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

పిచ్చికుక్క దాడి.. గాయాలు

సంగారెడ్డి క్రైమ్: కుక్కల దాడిలో చిన్నారి గాయపడింది. ఆదివారం పట్టణంలో పిచ్చికుక్క పాపపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు

కొండపాక(గజ్వేల్): పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... కామారెడ్డి సమీపంలోని లింగంపల్లికి చెందిన సురేందర్‌గౌడ్, కొండాపూర్‌కు చెందిన మైలారం సంతోష్ ఆదివారం సిద్దిపేటలోని స్నేహితుల వద్దకు వచ్చారు. ఈ క్రమంలో మరికొంత మందితో కలిసి పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్, పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి సురేందర్‌గౌడ్, సంతోష్‌లను పట్టుకున్నారు. ఖరీమ్, పోశయ్య,కోఫ్లీ, స్వామి, గాలెం భూమయ్య పారిపోయారు. వారి వద్ద నుంచి 2 సెల్‌ఫోన్లతో పాటు రూ.700 నగదు, ఆట కోసం రూ.50వేలు ఆన్‌లైన్ ఫోన్ పేలో పెట్టుకున్న డబ్బులను సైతం స్వాధీనం చేసుకున్నారు.

కిరాణం డబ్బాలో చోరీ



శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వ్యక్తులు కిరాణం డబ్బాలో శనివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. మండలంలోని గూడూర్ గ్రామానికి చెందిన పాపం రవి తూప్రాన్–నర్సాపూర్ హైవే పక్కనున్న శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘం వద్ద రేకులతో డబ్బా ఏర్పాటు చేసుకుని కిరాణ దుకాణం కొనసాగిస్తున్నాడు. అర్ధరాత్రి వెనుక భాగంలో రేకులు తొలగించి లోనికి చొరబడి 5 వేల నగదు, పలు సామగ్రిని చోరీ చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రాణం తీసిన చేపల వేట

ఒకరు మృతి



లతీఫ్

నారాయణఖేడ్: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన యువకుడు మృతి చెందాడు. మరొకరు గల్లంతైన ఘటన మనూరు మండలం కమలాపూర్ చెరువులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఖేడ్ పట్టణానికి చెందిన లతీఫ్ (30), మహ్మద్, సుధీర్, సందీప్, అద్నాన్ కలిసి సాయంత్రం కమలాపూర్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. లతీఫ్ చెరువు నీటిలో గల్లంతయ్యాడు. సాయంత్రం వరకు వెతకగా రాత్రి అతడి మృతదేహం బయట పడింది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. నిమజ్జనాలకు వచ్చేవారు పలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

కల్తీ సవాల్..!

కేసులు పెట్టినా మారని తీరు

- ఏడాది క్రితం 2వేల లీటర్ల పాలు కల్తీ
- తాజాగా 200 కేజీల నెయ్యి..
- అనుమతులు లేకుండా తయారీ, సరఫరా

అభం, శుభం తెలియని చిన్నారులతోపాటు ప్రజలు సైతం నిత్యం తాగే పాలు కల్తీ అవుతున్నాయి. పాలు, నెయ్యి తదితర పదార్థాలు కల్తీ చేస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతూ కేసులు పెడుతున్నా తీరు మారడం లేదు. తిరిగి మళ్లీ కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటే గాని ఇలాంటివి పునరావృతం కావని ప్రజలు వాపోతున్నారు. – హత్నూర(సంగారెడ్డి)

మండలంలోని గోవిందరాజు పల్లి గ్రామ శివారులోని మధుప్రియ డెయిరీ ఫామ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కల్తీ నెయ్యి తయారు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడుల్లో 200 లీటర్ల కల్తీ నెయ్యి దొరికింది. దీంతోపాటు కాన్ ఫ్లోర్, టెస్టింగ్ సాల్ట్ ప్యాకెట్స్, మిల్క్ పౌడర్, మంచి నూనె ప్యాకెట్స్, కాటన్ ఇతర కెమికల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. యజమాని బొమ్మ రాఘవేంద్రపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కల్తీ నెయ్యిని తయారు చేస్తూ హైదరాబాద్ ,సంగారెడ్డి, పటాన్ చెరు ,నర్సాపూర్, జోగిపేట ఇతర పట్టణాల్లోని హోల్‌సేల్ దుకాణాలకు సరఫరా చేస్తూ లక్షలు గడిస్తున్నాడు.

➡ కాగా ఇదే డెయిరీపై 2024లో అప్పటి ఎస్పీ రూపేశ్ ఆదేశాల మేరకు సీసీఎస్ పోలీసులు దాడి చేశారు. 200 లీటర్ల పాలతో 2వేల లీటర్ల కల్తీ పాలు తయారు చేస్తూ యజమాని పట్టుపడ్డారు. అప్పట్లో కూడా కేసు నమోదైంది. పాల సరఫరా నిలిపివేసి, తిరిగి కల్తీ నెయ్యి తయారు చేస్తున్నాడు. కల్తీ రాయుళ్లపై పోలీసులు కఠినంగా వ్యవహరించి శిక్ష పడేలా చూడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

➡ రెండేళ్ల క్రితం వడ్డేపల్లి గ్రామ శివారులో ఓ ఫామ్ హౌస్‌లో కల్తీ పాలు తయారు చేసిన వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెల్లనివన్నీ పాలని కొనేస్తే ప్రాణాలకే ప్రమాదమని, ప్రజలు జాగ్రత్తగా పాలు, నెయ్యి, తినే వస్తువులను కొనుగోలు చేయాలని వైద్యులు సూచిస్తున్నారు.



డెయిరీ ఫామ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యి డబ్బాలు

శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించాం



మధుప్రియ డెయిరీ ఫామ్ నెయ్యి శాంపిల్‌ను ల్యాబ్‌కు పంపించాం. రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలుంటాయి. ప్రస్తుతానికి అనుమతులు లేకుండా నెయ్యి తయారు చేస్తుండటంపై యజమాని బొమ్మ రాఘవేందర్‌తో పాటు అందులో పని చేసే కార్మికులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆహార పదార్థాల తయారీపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నాం. ఏ పదార్థమైనా కల్తీవి తయారు చేస్తే ఈ నంబర్ 99856 00602కు సమాచారం అందించండి.
– రాజేశ్వర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సంగారెడ్డి జిల్లా

కల్తీ పదార్థాలు తింటే అనారోగ్యమే..



కల్తీ పాలు, నెయ్యి తినడం వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు, జీర్ణ సమస్యలు, దీర్ఘకాలంలో కాలేయం, మూత్రపిండాలు, గుండెపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీర్ఘకాలం కల్తీ ఆహారం తీసుకుంటే కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. పిల్లలకు రక్తహీనత, ఎముకల బలహీనత, రోగనిరోధక శక్తి తగ్గుతుంది.
– డాక్టర్ రజని, పీహెచ్‌సీ వైద్యురాలు

అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: అతిగా మద్యం తాగిన వ్యక్తి పడుకున్న చోటే మృతి చెందాడు. పటాన్‌చెరు పోలీసుల వివరాల ప్రకారం... పశ్చిమ బెంగాల్‌కు చెందిన సునీల్ యాదవ్(41) బతుకుదెరువు కోసం వచ్చి మండలంలోని పెద్ద కంజర్ల గ్రామంలో అరబిందో నిర్మిస్తున్న నిర్మాణాల వద్ద లేబర్ క్యాంప్‌లో ఉంటూ, కూలి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం పనికి వెళ్లి తిరిగి లేబర్ క్యాంపునకు మద్యం తాగి వచ్చి పడుకున్నాడు. తిరిగి మరుసటి రోజు ఆదివారం ఉదయం సునీల్‌ను నిద్రలేపేందుకు రూమ్‌లో ఉండే ప్రమోద్ ప్రయత్నించగా మృతిచెంది ఉన్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. అయితే మృతుడు కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నట్టు తోటి కార్మికులు చెప్పారు.

విద్యుదాఘాతంతో రైతు..



రైతు నర్సయ్య

తొగుట(దుబ్బాక): మోటారు సరిచేస్తుండగా విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని చందాపూర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవికాంత్ రావు కథనం మేరకు... గ్రామానికి చెందిన చందా నర్సయ్య (65)కు గ్రామ శివారులో కూడవెల్లి వాగు సమీపంలో ఎకరం భూమి ఉంది. వాగులోని నీటిలోకి మోటారు వేసి వరిసాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మోటారు కొంత దూరం కొట్టుకుపోయింది. ఉధృతి తగ్గడంతో మోటారు బయటకు తేలింది. దీంతో ఆదివారం వాగులోకి దిగిన నర్సయ్య మోటారును సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన రైతులు కాపాడేందుకు ప్రయత్నించగా ఆయన అప్పటికే మరణించాడు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. అనంతలోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకుల మృతి
- మరో ఐదుగురికి గాయాలు



వెంకట్

జహీరాబాద్: దైవ దర్శనానికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం... ఆదివారం సాయంత్రం జహీరాబాద్ పట్టణంలోని ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన కుటుంబం ఆల్టో కారులో దైవ దర్శనం నిమిత్తం న్యాల్‌కల్ మండలంలోని ముంగి గ్రామంలో గల ఆదిలక్ష్మి ఆలయానికి వెళుతున్నారు. మండలంలోని కొత్తూర్(బి) గ్రామ శివారులో వీరు ప్రయాణిస్తున్న కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న వెంకట్(33), ఆయన అక్క కుమారుడు సాయిలు (20)లు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు. కారులో ప్రయాణిస్తున్న నాగేశ్వరరావు, వరలక్ష్మి, రుషికేష్, జాన్వీ, హరిచందనలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. మృతులు వెంకట్, సాయిలు మామ అల్లుడు అవుతారు. లారీ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ శివలింగం, ఎస్.ఐ వినయ్‌కుమార్‌లు సందర్శించి కారులో ఇరుక్కుపోయిన మృత దేహాలను బయటకు తీయించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారులో నుంచి మృతదేహాలను బయటకు తీయిస్తున్న సీఐ, ఎస్ఐ

వివాహిత ఆత్మహత్య

పుల్‌కల్(అందోల్): వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పుల్‌కల్ పోలీసుల వివరాల ప్రకారం.. సింగూరు గ్రామానికి చెందిన మహబూబ్ బీ(22)కి మిన్‌పూర్ గ్రామానికి చెందిన మోహిన్‌తో రేండేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల తరుచూ గొడవలు జరుగుతుండటంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి నచ్చజెప్పారు. శనివారం భార్యాభర్తల మధ్య ఇంట్లో గొడవలు జరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన మహబూబ్‌బీ ఉరివేసుకుంది. కాగా మృతురాలి కుటుంబీకులు తమ బిడ్డను అత్తింటివారే హత్యచేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

అప్పుల బాధతో ఉరివేసుకుని..

సిద్దిపేటరూరల్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతమడక గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్ వివరాల మేరకు... గ్రామానికి చెందిన రాందేని శ్రీనివాస్(54) కూలీ పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ పోషణ ఇబ్బంది కావడంతో ఈఎంఐలో ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. అది సరిగా నడవకపోవడంతో అప్పులు తెచ్చి ఈఎంఐ కట్టేవాడు. దీంతో పాటు ఇంటిపై లోన్ తీసుకుని హోటల్ వ్యాపారం చేయగా అదికూడా సరిగా నడవకపోవడంతో దీంతో అప్పులెక్కువయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుండి బయటకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబీకులకు చెప్పారు.

పచ్చకామెర్లతో యువకుడు మృతి



జగదేవ్‌పూర్(గజ్వేల్): పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బస్వాపూర్‌గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికు ల కథనం ప్రకారం.. .గ్రామానికి చెందిన రెడ్డమైన మహిపాల్(28) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. వారం రోజుల క్రితం జ్వరం రావడంతో గ్రామంలోనే ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకున్నాడు. అయినా తగ్గకపోవడంతో గజ్వేల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. అందరితో కలిసిమెలిసి ఉండే మహిపాల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గల్లంతైన మహిళ కోసం గాలింపు

కొల్చారం(నర్సాపూర్): ఈనెల 17న మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన ప్రమీల కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి మంజీరా నదిలో గల్లంతైన విషయం తెలిసిందే. కలెక్టర్ ఆదేశాలతో ఆదివారం ఎస్డీఆర్ఎఫ్, జిల్లా ఫైర్ అధికారి వేణు ఆధ్వర్యంలో నదీ తీరం వెంట గాలింపు చర్యలు చేపట్టారు. బైనాక్యులర్ సహాయంతో పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి వేణు మాట్లాడుతూ.. నది ఉధృతి ఎక్కువగా ఉండటం, నదిలో బోటు దించేందుకు అనుకూలంగా లేదన్నారు. డ్రోన్ కెమెరా ద్వారా నదీ పరిసర ప్రాంతాల వెంట పరిశీలిస్తామని తెలిపారు. ప్రమీల ఆచూకీ ఎప్పుడు లభిస్తుందా? అని ఆమె కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు తుక్కాపూర్ బ్రిడ్జి వద్ద ఎదురు చూస్తున్నారు.



నదీ పరిసరాల వెంట ఎస్డీఆర్ఎఫ్, ఫైర్ బృందం గాలింపు

ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు ..

డీఈఓకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

చేగుంట(తూప్రాన్): ఈ టీచర్ మాకొద్దని గ్రామస్తులు డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన మండలంలోని రాంపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల వివరాల ప్రకారం... రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు సైకోలా ప్రవర్తిస్తూ విద్యార్థులను ఒకరితో ఒకరిని చెంపలపై కొట్టించడం, కాలితో తన్నడం వంటి పనులు చేస్తున్నాడు. అంతే కాకుండా పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులతో పాటు స్కావెంజర్ పట్ల దురుసుగా ప్రవర్తించగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొద్దిరోజుల క్రితం ఉపాధ్యాయుడిపై దాడికి వచ్చి నేరుగా డీఈఓ రాధాకిషన్‌కు ఉపాధ్యాయుడి వికృత చర్యలపై ఫోన్‌లో వివరించారు. డీఈఓకు గ్రామస్తులు ఫిర్యాదు చేసిన నాటి నుండి సదరు ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లాడు. ఈ విషయంలో ఎంఈఓ నీరజను వివరణ కోరగా ఉపాధ్యాయుడు పాఠశాల విద్యార్థుల పట్ల ప్రవర్తించిన తీరు సరిగా లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చుంచనకోటలో అడవి జంతువు సంచారం

లేగ దూడ మృతి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని చుంచనకోట గ్రామ శివారులోని పెద్ద గుట్టల్లో గుర్తు తెలియని అడవి జంతువు సంచరిస్తుందని, పరిసర ప్రాంతాల రైతులు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్టు బీట్ అధికారి రాముడు తెలిపారు. ఆదివారం గ్రామ శివారులోని పెద్ద గుట్ట ప్రాంతంలో యాట కనకయ్యకు చెందిన లేగ దూడ గుర్తు తెలియని అడవి జంతువు దాడిలో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పెద్ద గుట్ట ప్రాంతంలో చిరుత లేదా పెద్ద నక్క(జుక్కల్) సంచరిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేశాడు. కావున పరిసర ప్రాంతాల రైతులు, కడవేర్గు, పోతిరెడ్డిపల్లి గ్రామాల రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ముఖ్యంగా పశువులను ఇంటి వద్దనే కట్టేసుకోవాలన్నారు. అలాగే పొలం పనులకు వెళ్లే రైతులు గుంపుగా వెళ్లి, తిరిగి సాయంత్రం 6 గంటలలోపు ఇండ్లకు చేరుకోవాలని సూచించారు. ఆయన వెంట పలువురు రైతులున్నారు.



మృతి చెందిన లేగ దూడను పరిశీలిస్తున్న బీట్ అధికారి రాముడు

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

గజ్వేల్‌రూరల్: విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా యూఎస్ఎఫ్ఐ పోరాడుతోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రవి, తిరుపతిలు అన్నారు. పట్టణంలోని కోలా అభిరాం గార్డెన్స్‌లో ఆదివారం రెండవ రోజు యూఎస్ఎఫ్ఐ జిల్లా ప్రథమ మహాసభలు కొనసాగాయి. ఈ సందర్భంగా సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థలకు సొంత భవనాలను నిర్మించాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ, లెక్చరర్, వర్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా శేఖర్, రవిని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రవి

మౌలిక వసతులేవీ?

తూప్రాన్ మున్సిపల్‌గా మారినా.. అవే సమస్యలు

- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తూప్రాన్: శరవేగంగా విస్తరిస్తున్న పట్టణంలో నిర్మాణాలు జోరందుకున్నా మౌలిక వసతుల కల్పన కలగానే మిగిలింది. తూప్రాన్ మేజర్ పంచాయతీ నుంచి మున్సిపల్‌గా మారి ఏళ్లు గడుస్తున్నా సౌకర్యాలు మాత్రం అధికారులు కల్పించడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు. మున్సిపల్‌గా మారితే పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పిస్తారని ప్రజలు అనుకున్నారు. కానీ, సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీలు లేకపోవడంతోపాటు అస్తవ్యస్త పారిశుద్ధ్యం, పారుతున్న మురుగునీరు తదితర కాలనీల్లో సమస్యలు పేరుకుపోయాయి. పలు మార్లు పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు.

తూప్రాన్ మున్సిపల్ పరిధిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పట్టణంలో జనాభా–22,148 మంది ఉండగా, ఇందులో మహిళలు–11,154, పరుషులు–10,994 మంది ఉన్నారు. వేగంగా విస్తరిస్తున్న పట్టణంలో జనాభాకు తగ్గట్లు అధికారులు వసతులు కల్పించడం లేదు. మున్సిపాలిటీలో అస్తవ్యస్తమైన డ్రైనేజీ, అసంపూర్ణ పారిశుద్ధ్యం, సీసీరోడ్లు తదితర మౌలిక వసతులు లేని కారణంగా నిత్యం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీల్లో అక్కడక్కడ మురుగునీరు నిలిచి దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. తూప్రాన్ మున్సిపాలిటీగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిపాలన పరంగా అధికారులు, సిబ్బందిని నియమించకపోవడం గమనార్హం. మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించకపోవడంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని సాయినగర్, విద్యానగర్, నాగార్జున కాలనీ, ఎస్సీ కాలనీ, కింది బస్తీ, బీడీ కార్మికుల కాలనీ తదితర కాలనీల్లోని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యలపై దృష్టి సారించి, మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.



లక్ష్మీనగర్ కాలనీలో ఇండ్ల మధ్య నిలిచిన మురుగునీరు



ఇండ్ల మధ్య అంతర్గత డ్రైనేజీ నిర్మాణం, సీసీరోడ్డు కోసం నిర్మించి వదిలేసిన మ్యాన్‌హోల్స్

మున్సిపల్ ఆదాయం..

మున్సిపాలిటీకి ప్రతి ఏటా సుమారు రూ.2.5 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ఇందులో ఇంటి పన్నులు, లైసెన్స్‌ల రూపంలో రూ.1.75 కోట్లు, ఇతర పన్నుల రూపంలో మరో రూ.50 లక్షల వరకు వస్తాయి.

ఇబ్బందులు లేకుండా చూస్తాం



నిధుల కొరత కారణంగా పట్టణంలో మౌలిక వసతులు కల్పన విషయంలో జాప్యం నెలకొంది. త్వరలోనే మున్సిపల్‌కు టీయుఎఫ్ఐడీసీ ద్వారా రూ.15 కోట్ల నిధులు మంజూరు కానున్నాయి. ఈ నిధులతో పట్టణంలోని 16 వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. ప్రస్తుతం పన్నుల రూపంలో వస్తున్న ఆదాయం .. కార్మికుల వేతనాలు, తదితర పనులకే సరిపోతుంది.
–పాతూరి గణేశ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తూప్రాన్